సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం। 11। మే। 2023



చీనీ టన్ను రూ.38 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.38 వేలు పలికాయి. మార్కెట్‌కు 831 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



నేత్రపర్వం.. శ్రీవారి రథోత్సవం

ప్రసిద్ధిగాంచిన పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.

8లో

గరిష్టం/కనిష్టం
40.1°/23.3°

జిల్లాలో బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఉక్కపోత అధికంగానే ఉంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా వర్షం పడింది.

న్యూస్‌రీల్

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కదిరి అర్బన్: కుటాగుళ్ల రైల్వే గేట్ వద్ద ఉన్న గిరిజన సంక్షేమ గురుకుల(బాలుర)పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశాలకు (2023–24 విద్యాసంవత్సరం) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ నాయక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణ తర్వాత అనంతపురంలోని గిరిజన సంక్షేమ కార్యాలయంలో లాటరీ పద్ధతిపై విద్యార్థులను ఎంపిక చేస్తారన్నారు. 3వ తరగతిలో 40 సీట్లు (ఓసీ–1, బీసీ–2,ఎస్సీ–5, ఎస్టీ–32), బ్యాక్‌లాక్‌లో 4వ తరగతిలో 37, 5వ తరగతిలో 25, 6వ తరగతిలో 10, 8వ తరగతిలో 12 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. గిరిజన విద్యార్థులు ఈ నెల 11వ తేదీ నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు 9440859247 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

బీటెక్ ఫలితాలు విడుదల



బీటెక్ ఫలితాలను విడుదల చేస్తున్న జేఎన్‌టీయూ(ఏ) వీసీ జింకా రంగజనార్దన

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) బీటెక్ నాల్గో సంవత్సరం రెండో సెమిస్టర్ రెగ్యులర్ (ఆర్–19), సప్లిమెంటరీ (ఆర్–15) పరీక్ష ఫలితాలను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన బుధవారం విడుదల చేశారు. రెగ్యులర్ పరీక్షలకు 14,508 మంది విద్యార్థులు హాజరుకాగా.. 13,317 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ పరీక్ష ఫలితాలకు సంబంధించి రీకౌంటింగ్ ఫొటో కాపీ, చాలెంజ్ వాల్యుయేషన్ నోటిఫికేషన్ జారీ చేస్తున్నామని, గురువారం నుంచి దరఖాస్తు చేసుకోవాలని వైస్ చాన్సలర్ సూచించారు. అలాగే ఈ నెల 25 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంబీఏ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను కూడా ఈ సందర్భంగా విడుదల చేశారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, డీఏపీ ప్రొఫెసర్ వి.సుమలత, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ.కేశవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు ఇంద్ర ఏసీ సర్వీసు



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి, ఆర్టీసీ రీజనల్ చైర్‌పర్సన్ మంజుల

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపోలో నూతనంగా ఏర్పాటు చేసిన కదిరి–హైదరాబాదు ఇంద్ర ఏసీ బస్సు సర్వీసును బుధవారం ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి, ఆర్టీసీ రీజనల్ చైర్‌పర్సన్ మంజుల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కదిరి వాసులు హైదరాబాద్‌కు వెళ్లేందుకు అన్ని హంగులతో కూడిన బస్సును ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. మాల్యవంతం మంజుల మాట్లాడుతూ.. ఈ బస్సు కదిరిలో రోజూ రాత్రి 9:30 బయలుదేరి ఉదయం 5:45 గంటలకు బీహెచ్ఈఎల్‌కు చేరుకుంటుందన్నారు. బీహెచ్ఈఎల్‌లో రాత్రి 9:30 గంటలకు బయలుదేరి ఉదయం 7:30 గంటలకు కదిరికి చేరుకుంటుందన్నారు. సీనియర్ సిటిజన్‌లకు చార్జీలో 25 శాతం రాయితీ ఉంటుందన్నారు. కదిరి నుంచి బీహెచ్ఈఎల్‌కు రూ.1,100 టికెట్ ధర ఉందన్నారు. కార్యక్రమంలో డీఎం మైనుద్దీన్, అసిస్టెంట్ మేనేజర్ హరిత పాల్గొన్నారు.

సారా కేసుల నిందితుడిపై పీడీ యాక్ట్



పాములానాయక్

గుత్తి/అనంతపురం శ్రీకంఠంసర్కిల్: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం మిద్దె తండాకు చెందిన పాములా నాయక్ అనే వ్యక్తిపై కలెక్టర్ గౌతమి ఆదేశాల మేరకు గుత్తి సెబ్ పోలీసులు బుధవారం పీడీ యాక్ట్ ప్రయోగించారు. ఈ విషయంపై ఎస్పీ కె. శ్రీనివాసరావు అనంతపురంలో మీడియాతో మాట్లాడారు. రమావత్ పాములా నాయక్‌పై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి జైలుకు తరలించినట్లు తెలిపారు. నిందితుడిపై గుత్తి స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో స్టేషన్‌లో రెండు కేసులు, గుత్తి పోలీసు స్టేషన్‌లో ఒక కేసు నమోదైందన్నారు. సుమారు 198 లీటర్ల నాటు సారాతో పాటు 2 ద్విచక్ర వాహనాలను సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారన్నారు. ఇతను విక్రయించే నాటు సారా ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని, దీంతో పీడీ యాక్ట్ ప్రయోగించి జైలుకు పంపామన్నారు.

ఆపత్కాలంలో.. అభయం





సంతోషంగా తన బిడ్డను అందుకుంటున్న ఈమె పేరు మల్లిక. నార్పల మండలం వెంకటంపల్లి. మల్లికకు మూడు నెలల క్రితం ఉన్నట్లుండి పురిటి నొప్పులు వచ్చాయి. రాత్రి 9 గంటలు కావడంతో ఆమె కుటుంబసభ్యులు భయపడిపోయారు. ఆ సమయంలోనే ఎవరో చెబితే 108కి ఫోన్ చేశారు. 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామానికి నిమిషాల వ్యవధిలో 108 వాహనం చేరుకుంది. గర్భిణిని అనంతపురం తీసుకెళ్తుండగా, మార్గమధ్యంలో పండంటి బిడ్డ పుట్టింది. వీరిద్దరికే కాదు.. జిల్లాలో నిత్యం వందల మందికి 108 అంబులెన్స్‌లు ఆపన్నహస్తం అందిస్తున్నాయి.

కేటగిరీ	సేవలు పొందిన వారు
కోవిడ్	211
గర్భిణులు	26,281
ప్రమాద బాధితులు	8,744
శ్వాసకోశ బాధితులు	8,681
కిడ్నీ బాధితులు	12,993
స్పృహ కోల్పోయి	2,377
పాముకాటు బాధితులు	3,673
కడుపునొప్పి బాధితులు	5,901
గుండె సమస్యలతో	4,577
కిందపడి గాయపడిన వారు	4,542
మూర్ఛవ్యాధి బాధితులు	2,107
జ్వర బాధితులు	6,502
పాముకాటు బాధితులు	2,356
దాడుల్లో గాయపడ్డవారు	1,287
మధుమేహవ్యాధి..	947
ఇతరులు	13,466
మొత్తం	1,04,651

- పేదల పాలిట పెన్నిధిగా మారిన '108'
- ఏడాదిలోనే లక్ష మందికి పైగా సేవలు
- నిమిషాల్లోనే చేరుకుని, ప్రాణాలు కాపాడుతున్న అంబులెన్సులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం:
108 వాహనాలు పేదల పాలిట పెన్నిధిగా మారాయి. అర్ధరాత్రి, అపరాత్రి ఇలా ఏ సమయంలో ఫోన్ చేసినా కుయ్ కుయ్‌మని 108 వాహనాలు క్షణాల వ్యవధిలో ఘటనాస్థలానికి చేరుకుంటున్నాయి. పాముకాటు మొదలుకొని గుండెపోటు బాధితుల వరకూ ఎవరు ఫోన్ చేసినా వాలిపోతూ, ఆస్పత్రులకు తీసుకెళ్తున్నాయి. ఒక్క ఏడాదిలోనే 1,04,551 మంది ఈ అంబులెన్సుల ద్వారా సేవలు పొందారంటే 108 పథకం ఎంతలా ఆపన్నులకు అండగా నిలిచిందో అర్థం చేసుకోవచ్చు.

టీడీపీ హయాంలో నిర్వీర్యం..
దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి మానసపుత్రికగా పేరొందిన 108 సేవలను టీడీపీ హయాంలో నిర్వీర్యం చేశారు. గర్భిణులు పురిటి నొప్పులు వస్తే ఆస్పత్రికి రావడమే అప్పట్లో గగనంగా ఉండేది. అయితే, గతానికీ నేటికీ ఆ పథకం రూపురేఖలే మారిపోయాయి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక మండలానికొక అంబులెన్సు ఏర్పాటు చేశారు. సమాచారం ఇచ్చిన వెంటనే అరగంటలో ఆస్పత్రిలో ఉంటున్నారు. గుండెపోటు ఎంత ప్రమాదకరంగా ఉంటుందో తెలిసిందే. అలాంటి బాధితులు ఒక్క ఏడాదిలోనే 4,500 మందికి పైగా అంబులెన్సుల్లో వెళ్లి ప్రాణం కాపాడుకున్నారు. రోజుకు సగటున 287 మంది సేవలు పొందుతుండటం సామాన్య విషయం కాదని వైద్యులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 108 అంబులెన్సుల వివరాలు	
మొత్తం	66
బేసిక్ లైఫ్ సపోర్ట్ వాహనాలు	49
అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ వాహనాలు	15
నియోనేటల్ లైఫ్‌సపోర్ట్	02
ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు	165
పైలెట్లు (డ్రైవర్లు)	165

గతానికీ ఇప్పటికీ చాలా తేడా



మండలానికొక అంబులెన్సుతో సేవల్లో గణనీయ మార్పు వచ్చింది. వాహనాల సంఖ్య పెరగడం వల్ల ఘటనా స్థలికి వేగంగా చేరుకునే పరిస్థితి వచ్చింది. దీంతో బాధితులు గోల్డెన్ అవర్‌లో చికిత్సకు చేరువవుతున్నారు. ప్రాణాపాయం నుంచి బయటపడుతున్నారు.

– సంజీవరెడ్డి, మేనేజర్, 108 పథకం

పెద్ద ప్రమాదం తప్పించారు..



గత నెల 27న కాకి గ్రామ సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో నా కుడి కాలు విరిగింది. కుటుంబసభ్యులు బైకులో రొళ్ల సీహెచ్‌సీకి తీసుకొచ్చారు. రక్తస్రావం అధికం కావడంతో వెంటనే అందుబాటులో ఉన్న 108 వాహనంలో హిందూపురంలోని బాలాజీ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సకాలంలో ఆసుపత్రికి చేరడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

– భూతరాజు, కాకి గ్రామం, రొళ్ల మండలం

ఫోన్ చేస్తే.. స్పందించారు



ఇంటి ఆవరణలో నిద్రిస్తుండగా ఈ నెల 7న పాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనానికి సమాచారం అందించగా.. 15 నిమిషాల్లోనే అంబులెన్స్ వచ్చింది. రొళ్ల సీహెచ్‌సీ ఆస్పత్రికి తీసుకెళ్లింది. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కర్ణాటక రాష్ట్రం శిరా ఆస్పత్రికి 108లోనే తీసుకువెళ్లారు. సకాలంలో ఆస్పత్రికి చేరుకోవడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డా.

– మారన్న, కె.గొల్లహట్టి, రొళ్ల మండలం

ఈ–స్టాంపింగ్‌తో రిజిస్ట్రేషన్లు

- జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారి



ప్రశాంతి నిలయం: ఇక నుంచి ఈ–స్టాంపింగ్‌తోనూ రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం కల్పించినట్లు జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారి బుధవారం ప్రకటనలో తెలిపారు. అఫిడవిట్లు, అగ్రిమెంట్లు, దస్తావేజుల రిజిస్ట్రేషన్‌లకు ప్రస్తుతం వాడుతున్న నాన్ జుడీషియల్ స్టాంపుల స్థానంలో ఈ–స్టాంపింగ్ కూడా చేయవచ్చన్నారు. ఈ–స్టాంపింగ్ చేసిన డాక్యుమెంట్లు సాధారణ నాన్ జుడీషియల్ బాండు పేపర్లతో సమనంగా చలామణి అవుతాయని చెప్పారు. ఈ–స్టాంపింగ్ ద్వారా స్టాంపుల అమ్మకం లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకుంటే, స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ సత్వరమే లైసెన్సులు మంజూరు చేస్తుందన్నారు. ఈ స్టాంపింగ్ ద్వారా ముద్రలు పొందినా, రిజిస్ట్రేషన్‌కు అనుమతించేలా సబ్ రిజిస్ట్రార్లందరికీ మార్గదర్శకాలు జారీ చేశామన్నారు. జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నాన్ జుడీషియల్ స్టాంప్ పేపర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఏ కార్యాలయ పరిధిలోనైనా కొరత ఉంటే సమీపంలోని మరో కార్యాలయం నుంచి తెప్పిస్తామని, అవసరమైతే పొరుగు జిల్లా నుంచి తెప్పించి సర్దుబాటు చేస్తామన్నారు. నాన్ జుడీషియల్ స్టాంపుల కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు అమ్మినా కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ–స్టాంపింగ్ లైసెన్స్‌ల మంజూరుకు సంబంధించి వివరాల కోసం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చన్నారు.

'ఈ స్టాంపింగ్'కు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం టౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ స్టాంపింగ్ విధానంలో స్టాంపుల విక్రయాలు చేపట్టేందుకు దరఖాస్తు చేసుకోవాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 21 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 10వ తరగతి, ఆపైన విద్యార్హతలున్న నిరుద్యోగులతో పాటు ప్రస్తుత స్టాంప్ వెండర్లు సైతం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఏ రోజుకారోజు తేదీల వారిగా అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా ఈ స్టాంప్ విధానం అమలవుతుందన్నారు. జిల్లాలో ఈ నెల 15 నుంచి అమలు చేస్తున్నామన్నారు. వివరాలకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

ప్రజల్లో నమ్మకం పెంచాలి

- 'జగనన్నకు చెబుదాం' ప్రతిష్టాత్మక కార్యక్రమం
- ప్రతి గ్రీవెన్స్‌ను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలి
- 1902 టోల్ ఫ్రీ నంబర్ గురించి విస్తృత ప్రచారం చేయాలి
- స్పెషల్ ఆఫీసర్ కేవీఎన్ చక్రధర్ బాబు





సమీక్షలో పాల్గొన్న అధికారులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి చక్రధర్ బాబు, చిత్రంలో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి అర్బన్: 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా ప్రభుత్వంపై ప్రజలకున్న నమ్మకాన్ని మరింత పెంచాలని, ప్రతి గ్రీవెన్స్‌నూ ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని జిల్లా స్పెషల్ ఆఫీసర్, ఏపీ జెన్‌కో ఎండీ కేవీఎన్ చక్రధర్‌బాబు ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డితో కలిసి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంపై జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా చక్రధర్ బాబు మాట్లాడుతూ, ప్రభుత్వ సేవల నుంచి వ్యక్తిగత ఫిర్యాదుల దాకా మరింత మెరుగైన, సంతృప్తికర పరిష్కారం లభించేలా ప్రభుత్వం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఫిర్యాదుకీ నాణ్యమైన పరిష్కారం ఇవ్వాలన్నారు. ఫిర్యాదు నమోదైన తర్వాత అర్జీదారునికీ న్యాయం చేకూర్చాలన్నదే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. లబ్ధిదారులు నేరుగా సీఎం వైఎస్ జగన్‌తో మాట్లాడే అవకాశాన్ని ఉంటుందన్నారు. తాను నెలలో కనీసం రెండు సార్లు పర్యటిస్తానని, 'జగనన్నకు చెబుదాం' అమలును క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానన్నారు. క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులుంటే తెలియజేస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

అర్జీలు రీఓపెన్ కాకూడదు..
గ్రామ/వార్డు సచివాలయాల్లో సుమారు 250 సర్వీసులను అందిస్తున్నామని, ఏ సమస్య వచ్చినా నేరుగా ప్రజలు సచివాలయానికి వచ్చేలా వారికి నమ్మకం కలిగించాలని చక్రధర్ అన్నారు. కిందిస్థాయి సిబ్బంది యాక్టివ్‌గా, జవాబుదారీగా పనిచేయాలన్నారు. ఆర్థికపర సమస్యలున్నా, మంజూరుకు అనుమతులు కావాలన్నా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలన్నారు. రాష్ట్రస్థాయిలో ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఇక నుంచి రోజూ ప్రతి సచివాలయంలోనూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకూ ఫిర్యాదులు తీసుకోవాలన్నారు.

ప్రతి అర్జీదారునికీ ఫోన్ వెళ్తుంది..
ప్రతి పిటీషన్‌కు కాల్ బ్యాక్ ఆప్షన్ ఇచ్చారని, అర్జీదారుడికి సీఎంఓ కార్యాలయం నుంచి ఫోన్ వెళ్తుందని స్పెషల్ ఆఫీసర్ చక్రధర్ అన్నారు. సమస్య పరిష్కారమైందా... అధికారులు నాణ్యమైన పరిష్కారం చూపారా... లేదా అని మానిటర్ చేస్తారన్నారు. గ్రీవెన్స్‌ల పరిష్కారంలో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

పోస్టర్లు ప్రదర్శించాలి..
1902 టోల్ ఫ్రీ నంబర్‌ను జిల్లా, డివిజన్, మండల కేంద్రాలు, అన్ని ప్రాంతాల్లో ప్రజలకు కనిపించేలా ప్రచారం చేయాలని చక్రధర్ సూచించారు. గ్రామ/వార్డు సచివాలయాల్లో 1902 నంబర్ పోస్టర్లను ప్రదర్శించాలన్నారు.

మండలానికో ప్రత్యేక అధికారిని నియమించాం..
కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ, స్పందన అర్జీలపై నిత్యం ఫాలోఅప్ చేస్తున్నామన్నారు. గ్రీవెన్స్ సకాలంలో పరిష్కరించడానికి డివిజన్, మండల స్థాయి అధికారులతో సమీక్షిస్తున్నామన్నారు. ఇప్పటికే మండలానికి ఒక ప్రత్యేకాధికారిని నియమించామన్నారు. వారంతా అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపడంతో పాటు ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డీఆర్ఓ కొండయ్య, సీపీఓ విజయ్‌కుమార్, ఏపీఎస్పీ డీసీఎల్ ఎస్ఈ మోసెస్, ఆర్డీఓలు భాగ్యరేఖ, రాఘవేంద్ర, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్లు మధులత, భవాని శంకరి, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన కల్పించండి
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే వివిధ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ప్రత్యేకాధికారి చక్రధర్ బాబు సూచించారు. బుధవారం సాయంత్రం ఆయన కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ తో కలిసి పుట్టపర్తి మండలం జగరాజుపల్లి గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హౌసింగ్ లేఅవుట్, నాడు–నేడు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం సచివాలయంలో సర్పంచ్ లక్ష్మీనరసమ్మతో కలిసి సమీక్షించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ, సచివాలయాల ద్వారా 250 సేవలు అందించాలన్నారు. అనంతరం రైతు భరోసాకేంద్రాన్ని సందర్శించి కియోస్క్ పనితీరు పరిశీలించారు.

ప్రశాంతంగా పాలిసెట్ పరీక్ష

హిందూపురం: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి బుధవారం నిర్వహించిన పాలిసెట్–2023 పరీక్ష హిందూపురంలో ప్రశాంతంగా జరిగింది. 2,567 మంది దరఖాస్తు చేసుకోగా 2,303 మంది హాజరైనట్లు హిందూపురం పాలిసెట్ కోఆర్డినేటర్ ఎస్. హరీష్‌బాబు, అసిస్టెంట్ కోఆర్డినేటర్ టి.శ్రీనివాసులు తెలిపారు. ఇందులో బాలురు 1,232 మంది, బాలికలు 1071 మంది ఉన్నారని చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించామన్నారు. సాంకేతిక కారణాలతో హాల్ టికెట్ పొందలేని విద్యార్థులు పాలిటెక్నికల్ కళాశాలలో అప్లికేషన్, ఆధార్ చూపి ఫీజు చెల్లించగా పరీక్షకు అనుమతి ఇచ్చామన్నారు.



హిందూపురంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

హెచ్‌ఆర్‌ఏ పెరిగింది

పుట్టపర్తి అర్బన్/ ప్రశాంతి నిలయం: ఉద్యోగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న వైఎస్ జగన్ సర్కార్... నూతనంగా జిల్లా కేంద్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు తీపి కబురు చెప్పింది. ఆయా నూతన జిల్లా కేంద్రాల్లో హెచ్‌ఆర్‌ఏ 12 శాతం ఉండగా, దాన్ని 16 శాతం పెంచుతూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో 62 శాఖలకు చెందిన సుమారు 800 మంది ఉద్యోగులకు మేలు జరగనుంది.

హెచ్‌ఆర్‌ఏ పెంపుపై పీఆర్టీయూ హర్షం..
కొత్తచెరువు/పుట్టపర్తి టౌన్: జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏను 16 శాతానికి పెంచుతూ జగన్ సర్కార్ జారీ చేసిన ఉత్తర్వులపై పీఆర్టీయూ నాయకులు విష్ణువర్దనరెడ్డి, రజనీకాంతరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, బాబూసాహెబ్, మధుసూదన్‌రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రానికి 8 కిలోమీటర్ల దూరంలోని అన్ని ప్రాంతాల పాఠశాలలకు ఈ ఉత్తర్వులను వర్తింపజేయాలని కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన హెచ్‌ఆర్‌ఏ పెంపు జీఓపై ఏపీ ఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు లింగా రామ్మోహన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పోలీస్ సిబ్బందికి సైతం సరెండర్ లీవులు, పీఆర్‌సీ అరియర్స్ అందజేయాలని, కాంటాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు.

చిత్తశుద్ధికి నిదర్శనం



కొత్తగా ఏర్పడిన జిల్లా కేంద్రాల్లోని ఉద్యోగుల ఇంటి అలవెన్స్ 4 శాతం పెంచుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకోవడం హర్షణీయం. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది అని చెప్పేందుకు ఇదే నిదర్శనం.

– పీవీ రమణారెడ్డి, ఏపీ వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా నాయకుడు

సంతోషంగా ఉంది



అనంతపురం నుంచి పుట్టపర్తికి వచ్చిన ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏ తక్కువగా ఉండేది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో వారంతా ఇప్పుడు సంతోషిస్తున్నారు. పుట్టపర్తి జనాభా తక్కువగా ఉండటం వల్ల హెచ్‌ఆర్‌ఏ పెంచరేమో అనుకున్నాం. కానీ ఉద్యోగుల బాధను అర్థం చేసుకుని హెచ్‌ఆర్‌ఏ పెంచడం ఆనందంగా ఉంది.

– రాజశేఖరరెడ్డి, భూగర్భజల వనరుల శాఖ

తీపి కబురే



నూతన జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏ పెంపు తీపి కబురే. హెచ్‌ఆర్‌ఏ సమస్యను మేము గతంలోనే సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లాం. ఆయన పరిశీలించి 16 శాతానికి పెంచుతూ జీఓ ఇవ్వడంతో అధికారులతో పాటు సిబ్బంది చాలా సంతోషించారు.

– మైనుద్దీన్, ఏపీ జేఏసీ నాయకుడు

సిమెంట్ గోల్‌మాల్‌పై విచారణ

మడకశిర: పంచాయతీరాజ్‌శాఖలో జరిగిన సిమెంట్ గోల్‌మాల్‌పై బుధవారం నుంచి విజిలెన్స్ విచారణ ప్రారంభమైంది. తొలిరోజు విజిలెన్స్ అధికారుల బృందం అమరాపురం, గుడిబండ మండలాల్లో విచారణ జరిపినట్లు తెలుస్తోంది. అదే విధంగా మడకశిర, రొళ్ల, అగళి మండలాల్లోనూ విచారణ చేయనున్నట్లు సమాచారం.

దారి మళ్లిన 80 వేల బస్తాలు
మడకశిర పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో 2019 నుంచి 2022 వరకు దాదాపు 800 వివిధ అభివృద్ధి పనులను చేపట్టారు. వీటికి ప్రభుత్వం దాదాపు 2 లక్షల బస్తాల సిమెంట్‌ను సరఫరా చేసింది. ఇందులో దాదాపు 80 వేల బస్తాల సిమెంట్ దారి మళ్లినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో అప్పటి పంచాయతీరాజ్ డీఈ, ముగ్గురు ఏఈలను ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. సిమెంట్ గోల్‌మాల్‌పై ఇంకా లోతుగా విచారణ చేయాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు పనుల వారీగా విచారణ చేపట్టారు. నియోజకవర్గంలో ఏయే పనులకు ఎంతెంత సిమెంట్ కేటాయించారో ఆరా తీస్తున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ల నుంచి సిమెంట్ వివరాలను తెలుసుకుంటున్నారు. ఎం బుక్కులను కూడా స్వాధీనం చేసుకుని పరిశీలన చేస్తున్నారు. ఈ విచారణ దాదాపు వారం రోజుల పాటు జరిగే అవకాశం ఉంది. విచారణలో అధికారుల ప్రమేయం ఉన్నట్లు తేలితే సిమెంట్ రికవరీతో పాటు చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

క్లుప్తంగా

కుక్కల దాడిలో దుప్పి మృతి



సోమందేపల్లి: దాహం తీర్చుకునేందుకు వచ్చిన దుప్పిపై కుక్కలు దాడి చేసి, చంపేశాయి. అటవీశాఖ అధికారులు తెలిపిన మేరకు.. బుధవారం ఉదయం సోమందేపల్లిలోని కొండ ప్రాంతం నుంచి దాహం తీర్చుకునేందుకు చెరువు వద్దకు ఓ దుప్పి వచ్చింది. ఆ సమయంలో ఎనిమిది కుక్కలు మూకుమ్మడిగా దాడి చేశాయి. వాటి బారి నుంచి తప్పించుకునేందుకు దుప్పి చేసిన ప్రయత్నాలు విఫలమై.. చివరకు ప్రాణాలు కోల్పోయింది. అనంతరం దుప్పి కళేబరాన్ని కుక్కలు గ్రామంలోకి లాక్కొచ్చాయి. విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే కుక్కలను తరిమేసి, సమాచారాన్ని అటవీశాఖ అధికారులకు చేరవేశారు. దుప్పి కళేబరాన్ని అటవీ అధికారులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం అనంతరం దహనం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు




గాయపడిన సాయికుమార్, చంద్రమోహన్

ఓడీ చెరువు: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు.. ఓడీ చెరువు మండలం దాదిరెడ్డిపల్లికి చెందిన సాయికుమార్ బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై మహమ్మదాబాద్‌క్రాస్‌కు బయలుదేరాడు. మార్గమధ్యంలో రామయ్యపేట వద్దకు చేరుకోగానే ఓడీ చెరువుకు ద్విచక్ర వాహనంపై వెళుతున్న గౌరాపురం నివాసి చంద్రమోహన్ ఢీకొన్నాడు. అతి వేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు వెంటనే కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు.

వృద్ధుడి ఆత్మహత్య

నల్లచెరువు: జీవితంపై విరక్తితో ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... నల్లచెరువు మండలం మద్దిమడుగు గ్రామానికి చెందిన ఎం.గోవిందరెడ్డి (95) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబసభ్యులు చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న వృద్ధుడు.. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషపూరిత ద్రావకం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ వరలక్ష్మి తెలిపారు.

‘దోటి’ కోతలు లాభదాయకం

- మామిడి కోత సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలి
- కాయలపై సొన కారితే నష్టాలు తప్పవు
- జిల్లా ఉద్యానశాఖాధికారి చంద్రశేఖర్




దోటితో కాయలు కోస్తున్న రైతు, (ఇన్‌సెట్) దోటికి అమర్చిన వల

పుట్టపర్తి అర్బన్: మామిడి సాగు చేయడం ఒక ఎత్తైతే... పంట కోతలు మరో ఎత్తుగా పరిణమిస్తున్నాయి. ఆరుగాలం శ్రమించి పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన మామిడి రైతులు... పంట చివరి దశలో ఏ మాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా నాణ్యమైన దిగుబడులు నష్టపోయే ప్రమాదముందని జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ హెచ్చరిస్తున్నారు. బుధవారం ఆయన ‘సాక్షి’తో మాట్లాడుతూ.. మామిడి కోతలో చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరించారు.

17 వేల హెక్టార్లలో కోత దశ..

జిల్లా వ్యాప్తంగా 22,350 హెక్టార్లలో రైతులు మామిడిని సాగు చేస్తున్నారు. ఇందులో కాయలు కాసి కోతకు వచ్చినవి సుమారు 11 వేల హెక్టార్లు ఉండగా.. ఐదేళ్లు పూర్తయి ఇప్పుడిప్పుడే కాత నిలిపిన తోటలు మరో 6 వేల హెక్టార్లలో ఉన్నాయి. చిన్న చెట్లలో కాయలను రైతు కూలీలు చేతులతోనే తొలగిస్తున్నారు. అయితే పెద్ద చెట్లతో కాయలు కోయడానికి ఇబ్బందులు తప్పడం లేదు.

దోటితో చాలా సులువు..

పెద్ద చెట్లలో మామిడి కాయలు కోసేందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చరల్ రీసెర్చ్ (ఐఐహెచ్‌ఆర్) వారు దోటి అనే సరికొత్త పరికరాన్ని కనుగొన్నారు. ఈ పరికరాన్ని ఉపయోగించి పెద్ద చెట్లలోని మామిడి కాయలను సులువుగా కోయవచ్చు. పైనున్న కాయను కోసినప్పుడు దోటికి అమర్చిన వలలో పడడం వల్ల కాయ నాణ్యతగా ఉంటోంది. దీంతో పాటు కొంకణ్ కృషి విద్యాపీఠ్ వారు సైతం డాపోలి అనే పరికరాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. పొడవాటి కట్టెకు ఓ చివరన అమర్చిన కత్తెరసాయంతో కాయను కత్తిరించగానే... కింద ఉన్న వలలో పడుతుంది. పై నుంచి కాయ నేలపై పడడం వల్ల నాణ్యత దెబ్బతినే ప్రమాదముంది. ఈ సమస్యను అధిగమించాలంటే దోటి లేదా డాపోలి పరికరాలను ఉపయోగించడం మంచిదని రైతులను ఉద్యాన శాఖ అధికారులు చైతన్య పరుస్తున్నారు.

కోత పరికరాల వినియోగం మేలు



సాధారణంగా మామిడిలో పిందె దశ ఆరంభమైన 100 నుంచి 110 రోజుల్లో కాయలను చెట్టునుంచి కోయాలి. అయితే కోత సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే చెట్టు పైనుంచి నేలపై పడిన కాయల్లో నాణ్యత లోపించే ప్రమాదముంది. దీంతో మామిడి కాయల కోతకు దోటి లేదా డాపోలి పరికరాలను వినియోగించడం మేలు. ఈ విషయంగా రైతులను చైతన్య పరుస్తున్నాం.

– చంద్రశేఖర్, జిల్లా ఉద్యానశాఖ అధికారి

సైబర్ నేరగాళ్ల వలలో టెక్కీ



అనంతపురం శ్రీకంఠంసర్కిల్: సైబర్ నేరగాళ్ల వలలో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ (టెక్కీ) చిక్కుకుని రూ.5 లక్షలు చేజేతులా అప్పగించి, చివరకు పోలీసులను ఆశ్రయించింది. అనంతపురం వన్‌టౌన్ సీఐ రవిశంకరరెడ్డి తెలిపిన మేరకు.. స్థానిక శారదానగర్‌లో నివాసముంటున్న రిషిత బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల సెలవుపై వచ్చిన ఆమెకు సోమవారం రాత్రి ఓ వ్యక్తి ఫోన్‌చేసి ‘మీ ఖాతాలోని రూ.45 లక్షలు వేరే ఖాతాల్లోకి జమ అయిందని, వాటిని తిరిగి మీ ఖాతాలోకి మళ్లించాలంటే రూ.5 లక్షలు తక్షణం తాను సూచించిన ఖాతాకు బదిలీ చేయాలని సూచించాడు. ఆ మాటల గారడీలో చిక్కుకున్న రిషిత వెంటనే నగదు బదిలీ చేసింది. అనంతరం తన ఖాతాను పరిశీలించుకున్న ఆమె తాను మోసపోయినట్లు గుర్తించి వెంటనే ఆగంతకుడి ఫోన్ నంబర్‌కు కాల్ చేసింది. అప్పటికే ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది, ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పనులు మొదలుపెట్టకపోతే రద్దు

జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

- 15వ ఆర్థిక సంఘం నిధులు, పనుల కేటాయింపుపై సమీక్ష
- హాజరైన పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఉమ్మడి జిల్లా అధికారులు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం సిటీ: ‘అన్ని ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం. దీనిని దృష్టిలో ఉంచుకుని 15వ ఆర్థిక సంఘం నిధులతో సమగ్రాభివృద్ధి సాధించాలని 58 మండలాలకు చెందిన జెడ్పీటీసీ సభ్యులకు రూ.8.16 కోట్లతో 185 పనులు మంజూరు చేశాం. ఈ పనులన్నీ గడువులోపు పూర్తి కావాల్సిందే’నని ఉమ్మడి జిల్లా అధికారులను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు, పనుల కేటాయింపుపై అనంతపురం జెడ్పీ కార్యాలయంలోని తన చాంబర్‌లో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో బుధవారం ఆమె సమీక్షించారు. పీఆర్ ఎస్‌ఈలు భాగ్యరాజ్, గోపాలరెడ్డి, రెండు జిల్లాల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు హాజరయ్యారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో మండలాల వారీగా మంజూరైన, పూర్తయిన, పురోగతిలో ఉన్న పనులపై ఆరా తీశారు. ఇప్పటి వరకూ 50 శాతం పనులు పూర్తి కాగా, వాటికి సంబంధించిన బిల్లులు కూడా మంజూరు చేశామన్నారు. మిగిలిన 50 శాతం పనులు వేగవంతం చేయాలన్నారు. లేకపోతే వాటిని రద్దు చేసి, ఇతర మండలాలకు నిధులు మళ్లించాలని ఆదేశించారు. నిధులు, నీళ్ల, నియామకాల విషయంలో అన్ని ప్రాంతాలకు సమ న్యాయం చేస్తున్నామని స్పష్టం చేశారు.

శభాష్.. భాస్కరరెడ్డి..

శింగనమల సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డిని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అభినందించారు. నియోజకవర్గానికి మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయడంతో పాటు డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేల నిర్మాణాల్లో జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచారని కొనియాడారు. ప్రత్యేక డిజైన్లను రూపొందించి, గడువుకు ముందే పనులు పూర్తి చేయడం ఆనందంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో ఇతర మండలాల ఇంజినీరింగ్ అధికారులు కూడా పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ ఎండీ అమృతరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈలు జవహర్ కుమార్(అనంతపురం), రషీద్ ఖాన్(శ్రీసత్యసాయి జిల్లా) పాల్గొన్నారు.

వేధింపుల కేసులో ఐదేళ్ల జైలు

అనంతపురం: అదనపు కట్నం కోసం వివాహితను వేధించిన కేసులో ముద్దాయిలకు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ జిల్లా నాల్గో అదనపు జడ్జి శోభారాణి బుధవారం తీర్పు వెలువరించారు. వివరాలు... అనంతపురంలోని విజయనగర కాలనీకి చెందిన సగినాల నూర్జహాన్ బేగానికి పెనుకొండలోని సబ్ ట్రెజరీ కార్యాలయంలో పనిచేస్తున్న డి.బాబుతో వివాహమైంది. పెళ్లి సమయంలో భారీగా కట్నకానుకలను తీసుకున్నా.. అనంతరం అదనపు కట్నం కోసం భర్తతోపాటు అత్త మల్లిక, ఆడపడుచు నసీమాభాను తరచూ నూర్జహాన్‌ను వేధించేవారు. ఈ క్రమంలోనే ఆమెపై హత్యాయత్నానికి పాల్పడడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు 2012, ఫిబ్రవరి 13న పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి ఈ కేసు వాదనలు జరుగుతూ వచ్చాయి. నేరం రుజువు కావడంతో ముద్దాయిలు బాబు, మల్లికకి ఐదేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.19వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున వాదనలను ప్రత్యేక ప్రాసిక్యూటర్ సుజన వినిపించారు.

వంద శాతం ఫీజు వసూళ్లే లక్ష్యం

మార్కెటింగ్‌శాఖ ఆర్జేడీ రామాంజినేయులు



మార్కెట్ యార్డు సెక్రటరీలతో సమావేశమైన ఆర్జేడీ రామాంజినేయులు

అనంతపురం అగ్రికల్చర్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన విధంగా ఫీజు వసూళ్లు వందశాతం సాధించితీరాలని మార్కెటింగ్ యార్డు కార్యదర్శులను ఆ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) సి.రామాంజినేయులు ఆదేశించారు. ఫీజు వసూళ్లపై స్థానిక మార్కెటింగ్‌శాఖ కార్యాలయంలో ఉమ్మడి అనంతపురం జిల్లా ఏడీఎం పి.సత్యనారాయణచౌదరితో కలిసి 17 మార్కెట్‌యార్డుల సెక్రటరీలు, సూపర్‌వైజర్లతో బుధవారం ఆయన సమీక్షించారు. గతేడాది ఓవరాల్‌గా 100 శాతం లక్ష్యం చేరుకున్నా... నిర్దేశిత ఫీజు వసూళ్లలో కొన్ని కమిటీలు వెనుకంజలో ఉన్నట్లు గుర్తు చేశారు. ఈ సారి అలా కాకుండా అన్ని కమిటీలు లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. అనంతపురం జిల్లా పరిధిలో ఉన్న 9 కమిటీల లక్ష్యం రూ.10.81 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని 8 కమిటీలకు రూ.4.92 కోట్ల వసూళ్ల లక్ష్యం నిర్దేశించినట్లు గుర్తు చేశారు. ఏప్రిల్‌తో ముగిసిన మొదటి నెలలో అనంతపురం జిల్లాలో రూ.1.51 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాలో రూ.40 లక్షల వసూలు జరిగాయన్నారు. లక్ష్యం దిశగా సాగుతున్నా కొన్ని కమిటీల్లో అనుకున్నంత పురోగతి కనిపించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మార్కెట్‌యార్డులు, చెక్‌పోస్టుల్లో విజిలెన్స్ చర్యలు పటిష్టం చేయాలని ఆదేశించారు. ఆడిటింగ్ శాఖను సంప్రదించి అభ్యంతరాలు పరిష్కరించుకోవాలని సూచించారు. గతేడాది వందశాతం సాధించిన మార్కెట్‌కమిటీల సెక్రటరీలకు ఈ సందర్భంగా ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డును సందర్శించారు. అక్కడ చేపట్టిన అభివృద్ధి పనులు, చీనీ మార్కెట్, కూరగాయల మార్కెట్ ఓపెన్‌షెడ్ నిర్మాణ పనులను పరిశీలించారు.

నేత్రపర్వం.. శ్రీవారి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

ఉరవకొండ రూరల్: ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం విశేష పూజల అనంతరం ఆలయ తూర్పు ద్వారం వద్ద మడుగుతేరును భక్తులు లాగారు. సాయంత్రం బ్రహ్మ రథంపై శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారసింహుడి ఉత్సవ మూర్తులను అధిష్టింపజేసి భక్తుల గోవింద నామస్మరణ మధ్య లాగారు. పూజల్లో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి, ఎస్పీ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లానుంచే కాక పొరుగున ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. భక్తులు ఎలాంటి అసౌకర్యాలు గురికాకుండా ఆలయ ఈఓ కె. విజయ్‌కుమార్, ప్రధాన అర్చకుడు ద్వారకానాథాచార్యులు చర్యలు తీసుకున్నారు. సర్పంచ్ లింగన్న, ఆలయ పాలక మండలి మాజీ చైర్మన్ అశోక్, ఎంపీపీ చందా చంద్రమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు లలితమ్మ, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ సుశీలమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

బంగారం పేరుతో మోసం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: మేలిమి బంగారం పేరుతో నకిలీ సరుకు అంటగట్టి రూ.లక్షలతో ఉడాయిస్తున్న ముఠా సభ్యులను స్థానికులు వెంటాడి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురంలోని 6వ రోడ్డు సమీపంలో మెడికల్ స్టోర్ నిర్వహిస్తున్న బాషాకు ఆగంతకులు ఫోన్ చేసి తమ వద్ద మేలిమి బంగారం ఉందని, తక్కువ ధరకే అందజేస్తామని తెలిపారు. వారి మాటలు నమ్మిన బాషా.. తన మెడికల్ స్టోర్ వద్దకే వస్తే నగదు ఇచ్చి బంగారం తీసుకుంటానని తెలిపాడు. దీంతో రెండు రోజుల క్రితం దుండగులు బాషాను కలసి పరిశీలించుకోవాలని కొన్ని పూసలు చేతికిచ్చారు. అవి మేలిమి బంగారం కావడంతో రూ. 5లక్షలు ఇచ్చి మిగిలిన పూసలు తీసుకున్నాడు. అనంతరం దుండగులు అక్కడి నుంచి జారుకుంటుండగా... అనుమానం వచ్చిన బాషా... తనకు బంగారం వద్దని డబ్బు వాపసు ఇవ్వాలన్నాడు. అతని మాటలు పట్టించుకోకుండా వారు అక్కడి నుంచి ఉడాయించడంతో వెంటనే స్థానికులను బాషా అప్రమత్తం చేసి, వెంబడించారు. అక్కడికి సమీపంలోని ఓ మార్ట్‌లో దూరిన దుండగులను స్థానికులు గుర్తించి, పట్టుకుని నాల్గో పట్టణ పోలీసులకు అప్పగించారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రూ.5 లక్షలతోపాటు, రెండు కిలోల బరువున్న నకిలీ బంగారు పూసలను స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం మంగళవారం నిందితులను అరెస్ట్ చూపి, రిమాండ్‌కు తరలించారు. కాగా, పట్టుబడిన దుండగులను గుజరాత్‌లోని అహమ్మదాబాద్ బస్తీ ఠక్కర్ నగర్‌కు చెందిన వీర నారాయణ, మధ్యప్రదేశ్‌లోని బోపాల్ జిల్లా, గాంధీనగర్ నివాసి సూరజ్‌కుంభాల్ ప్రజాపతిగా పోలీసులు గుర్తించారు.

తపాలా ఉద్యోగుల సొసైటీ అధ్యక్షుడిగా పీఎస్‌ఆర్‌కే ప్రసాద్

అనంతపురం సిటీ: అనంతపురం డివిజన్ తపాలా ఉద్యోగుల సహకార సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి పదవులకు బుధవారం నిర్వహించిన ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈ మేరకు ఎన్నికల అధికారి ఎస్.కుమార్ ప్రకటించారు. అధ్యక్షుడిగా పీఎస్‌ఆర్‌కే ప్రసాద్(పోస్టల్ అసిస్టెంట్–అనంతపురం హెడ్ పోస్టాఫీస్), ఉపాధ్యక్షుడిగా బి.నరేంద్రనాథ్‌రెడ్డి(మెయిల్ ఓవర్ సీర్–గుంతకల్లు), కార్యదర్శిగా బి.హర్షవర్ధన్‌రెడ్డి(పోస్టల్ అసిస్టెంట్–అనంతపురం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఐదేళ్ల పాటు వారు ఆ పదవుల్లో కొనసాగనున్నారు.

వైభవంగా హనుమజ్జయంతి ఉత్సవాల ప్రారంభం




విశేష అలంకరణలో మూలవిరాట్, గోపూజ నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో దక్షిణాది హనుమజ్జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువజామునే మూలవిరాట్‌కు అభిషేకాలు, విశేష అలంకరణ చేశారు. అనంతరం యాగశాలలో మధ్యాహ్నం 12.30 గంటల వరకు వివిధ పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో స్వామి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి తులసి లక్షార్చన చేశారు. అనంతరం నిర్వహించిన ప్రాకారోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ డి.వెంకటేశ్వర్లు, ఏఈఓ ధనుంజయ, ఆలయ ధర్మకర్త సుగుణమ్మ, ప్రధాన అర్చకుడు గరుడస్వామి, ఆలయ పాలక మండలి సభ్యులు పర్యవేక్షించారు.

రమణీయం.. బ్రహ్మరథోత్సవం



రాయదుర్గంలో అశేష జనవాహిని నడుమ సాగుతున్న శ్రీవారి బ్రహ్మ రథోత్సవం



అలంకరణలో వేంకటేశ్వరుడు

రాయదుర్గం: పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణుడి బ్రహ్మరథోత్సవం బుధవారం రమణీయంగా సాగింది. గోవింద నామస్మరణతో రాయదుర్గం మార్మోగింది.అన్నమయ్య కీర్తనలు, చెక్కభజన, కోలాటం, బొమ్మల ప్రదర్శన ఆకట్టుకున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ఉదయం 11 గంటలకు మడి తేరు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, సతీమణి కాపు భారతి, కుమార్తె స్రవంతిరెడ్డి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు అశేష భక్తజనం నడుమ బ్రహ్మరథోత్సవం ప్రారంభమైంది. వేలాదిగా తరలివచ్చిన భక్తజనం రథంపై అరటి పండ్లు విసురుతూ మొక్కులు తీర్చుకున్నారు. ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇట్టూరి శ్రీనివాసులు, జెడ్పీటీసీ మహేష్, ఆలయ కమిటీ చైర్మన్ పాలాక్షిరెడ్డి, ఈఓ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.